క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం

మామడ: మండలంలోని అనంతపేట్ గ్రామంలో శుక్రవారం శివాలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం వివిధ గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మామడ పీఏసీఎస్ చైర్మన్ చిక్యాల హరీశ్‌కుమార్ పూజలు చేశారు. అనతరం ఆలయాభివృద్ధికి రూ.11వేల విరాళం అందించారు. గంగాధర్, భీమన్న, గ్రామస్తులు ఉన్నారు.

పత్రాలు వెంట ఉంచుకోవాలి



మాట్లాడుతున్న సీఐ నారాయణనాయక్

కడెం: వాహనదారులు అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని ఖానాపూర్ సీఐ నారాయణ నాయక్ అన్నారు. శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని కొండుకూరు గ్రామంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 52 బైక్‌లు, మూడు ఆటోలు, ఓ ట్రాక్టర్‌ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి వెంట ఎస్సైలు రాజు, ప్రభాకర్‌రెడ్డి, పలువురు సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో జెడ్పీటీసీ పర్యటన

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి, తాండ్ర(జి), వైకుంఠాపూర్ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన అనంతరం తొలిసారి కార్యకర్తలు, ఆయా గ్రామాల నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం కోసం తనతో కలిసి రావాలని కోరారు. అనంతరం తాండ్ర(జి)లో ఎదులపురం సూర్యం ఇటీవల ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. మాజీ ఏఎంసీ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, ఏరిండ్ల చిన్నయ్య, శ్రీనివాస్, ఎల్లయ్య, సురేందర్, తదితరులు ఉన్నారు.

కూలీలు ఉదయమే పనులకు రావాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ ప్రసాద్

తానూరు: ఎండల నేపథ్యంలో కూలీలు ఉదయం ఏడు గంటలకే వచ్చి పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు వెళ్లాలని ఏపీడీ ఓస ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్వి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసుకున్న ఫాం పాండ్స్, ఆయిల్‌పాం సాగును పరిశీలించారు. పొలాల్లో ఫాంపాండ్స్ నిర్మించుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. జాబ్‌కార్డులు ఉన్న కూలీలు పనులకు వెళ్లాలన్నారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏలు ఉన్నారు.

అపరిచితుల మెసేజ్‌లకు స్పందించొద్దు

ముధోల్: అపరిచితుల నుంచి ఫోన్లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని ఎంఈవో మైసాజీ, పోలీసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మచ్కల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈవిషయమై తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. జాబ్స్, లోన్లు, లాటరీ అంశాలకు సంబంధించి ఫోన్లకు వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. హెడ్ కానిస్టేబుల్ జాదవ్‌ఉత్తం, సిబ్బంది చారి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు అందజేత

కుంటాల: మండల కేంద్రంలోని మసీద్‌లో ఆయా గ్రామాలకు చెందిన ముస్లింలకు శుక్రవారం రంజాన్ కానుకలు అందించారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తమ వంతు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, మైనార్టీ మండల కన్వీనర్ ఖదీర్, సర్పంచ్ హైమద్, అబ్దుల్లా, ఫయీమ్‌ఖాన్, బాబు, కమ్రొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెంబిలో..

పెంబి: ప్రభుత్వం సమకూర్చిన రంజాన్ కానుకలను మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పుప్పాల శంకర్ ముస్లింలకు అందజేశారు. సర్పంచ్ పూర్ణచందర్, డీటీ మంజులా, మతీన్, ఇస్మాయిల్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామ మున్నూర్‌కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా జంగిలి సత్తయ్య, గౌరవాధ్యక్షులుగా బక్కశెట్టి వెంకన్న, ప్రధాన కార్యదర్శులుగా గాజుల గంగాధర్, బూషి నర్సయ్య, ఉపాధ్యక్షులుగా బక్కశెట్టి చిన్న శ్రీనివాస్, రేండ్ల కిషన్, కార్యవర్గ సభ్యులుగా పస్నెల వెంకట్రాములు, జంగిలి పెద్దనర్సయ్య, జంగిలి శంకర్, గాజుల గంగన్న ఎన్నికయ్యారు.

ఆధునిక సాగుతో లాభాలు

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి
- మల్చింగ్ విధానంలో ఏటా మూడు పంటలు
- ఇతరులకు స్ఫూర్తిగా రైతులు



లోకేశ్వరంలో మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న ఖర్బూజ

లోకేశ్వరం: సంప్రదాయ పంటల సాగుతో విసుగు చెందిన రైతులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటూ ముందుకెళ్తున్నారు. తక్కువ నీటితో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. యాసంగి సీజన్‌లో లోకేశ్వరం, తానూరు, కుభీర్, సారంగపూర్, మామడ, లక్ష్మణచాంద, భైంసా, ముధోల్ తదితర మండలాల్లోని రైతులు 850 ఎకరాల్లో ఖర్బూజ పంట సాగు చేశారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మంచి లాభాలు పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. భైంసా, నిజామాబాద్‌కు చెందిన వ్యాపారులు హోల్‌సేల్‌గా ఖర్బూజ పంటను రైతుల నుంచి కొనుగోలు చేసి నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబార్‌తో పాటు మహారాష్ట్ర ప్రాంతాలకు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

మల్చింగ్ విధానంలో సాగు..

సాధారణ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే పెట్టుబడులు, నీటి వినియోగం చీడపీడల బెడద ఎక్కువ ఉంటుందని రైతులు తెలుసుకొని మల్చింగ్ విధానంలో సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ విధానంలో డ్రిప్ పద్ధతిలో పంటలకు సాగునీరు అందిస్తారు. దీంతో మొక్క ఉన్న చోట నీరు అంది వృథా కాకుండా ఉంటుంది. కలుపు బెడద ఉండదు. పంట చేతికందే సమయంలో పంట కుళ్లిపోవడం వంటి సమస్యలు రావు. సంవత్సరంలో అంతర పంటలతో కలిపి మూడు పంటలు తీస్తామని మండలంలోని రైతులు పేర్కొంటున్నారు.

మూడు నెలల్లో ఎకరాకు రూ.లక్షా అరవై వేలు



గ్రామంలో నాకు 12 ఎకరాల భూమి ఉండగా అందులో రెండున్నర ఎకరాల్లో యాసంగిలో ఖర్బూజ పంట సాగు చేశారు. ఎకరాకు రూ.45 వేలు పెట్టుబడి పెట్టి.. మూడు నెలల్లో లక్షా అరవై వేలు సంపాదించా. అందులో అంతర పంట బొప్పాయితో అదనపు ఆదాయం సమకూరుతోంది. – కృష్ణారెడ్డి, భాగాపూర్

ఖర్బూజ పంట సాగు లాభదాయకం



పండ్లు నిల్వ చేసుకునే వీలు లేక పోవడంతో వ్యాపారులు సూచించిన ధరకు విక్రయించాం. కిలోకు రూ.7 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. ఎకరాకు రూ.లక్ష సంపాదించా. రైతులకు ఈ పంట లాభదాయకం. ఖర్బూజకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా రైతులకు లాభం పరిమితమే. – పుష్పబాయి, నగర్

ప్రభుత్వం రాయితీ అందిస్తే..

ఆరుతడి పంటలు సాగు చేస్తున్న వారికి ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ షీట్‌లపై రాయితీ అందించాలని కోరుతున్నారు మండలంలోని ఆయా గ్రామాల రైతులు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని అవగాహన కల్పించే వ్యవసాయ అధికారులు లేకపోవడం, మార్కెటింగ్ సౌకర్యం మెరుగుపర్చక పోవడం వంటి సమస్యలతో ఆరుతడి పంటల సాగుకు రైతులు ముందుకు రావడం లేదు.

సీపీఆర్‌పై ఆసుపత్రుల్లో అవగాహన

తానూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు లక్షణాలు, రోగికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆకాశ్, డాక్టర్ రమ్య, కృపారాణి, ఫార్మసిస్ట్ సదానంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముధోల్‌లో..

ముధోల్: మండలకేంద్రమైన ముధోల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో సీపీఆర్‌పై భైంసా డివిజన్ ట్రైనింగ్ అధికారి డాక్టర్ ఆకాశ్ వైద్యులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చినప్పుడు ఎలా సీపీఆర్ చేయాలో వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సాయి, సువర్ధన్, సూపర్‌వైజర్ దత్తురాం, రోజా, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ముధోల్: అవగాహన కల్పిస్తున్న వైద్యులు ఆకాశ్

డిగ్రీ కళాశాలలో..

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఈఓ వేణుగోపాలరావు, శిక్షకుడు శ్రీనివాస్ విద్యార్థులు, సిబ్బందికి సీపీఆర్ చేసే విధానంలో మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జే.భీమారావు మాట్లాడుతూ విద్యార్థులు సీపీఆర్‌పై అవగాహన పెంచుకొని ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరేందర్, అజయ్, అరుణ్, రవికుమార్, పిజి.రెడ్డి, శంకర్, శ్రీహరి, రమాకాంత్, నర్సయ్య, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత సాధనతో ఉన్నత జీవనం

ముధోల్: ఆధాత్మికత సాధన ఉన్నత జీవనానికి మార్గదర్శనమని అఖిల భారతీయ హనుమాన్ దీక్ష పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ దుర్గప్రసాద్ స్వామీజీ అన్నారు. శుక్రవారం మండలంలోని సరస్వతినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హనుమాన్ ఆలయ ఆవరణలో హోమం, సంకీర్తన, అర్చన హనుమాన్ చాలీసా పారాయణం, అర్ధమండల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హనుమాన్ దీక్ష స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో ఘనస్వాగతం

భైంసాటౌన్: పట్టణంలో హనుమాన్ దీక్ష పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీకి శుక్రవారం హనుమాన్ స్వాములు ఘనస్వాగతం పలికారు. ముధోల్ మండలంలోని సరస్వతినగర్ నుంచి భైంసాకు చేరుకున్నారు. కిసాన్‌గల్లీలోని మహాదేవ్‌మందిర్‌లో హనుమాన్ దీక్షాపరులు, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బాగుబాయి గుట్ట మీదుగా రాంగుట్ట వరకు శోభాయాత్ర నిర్వహించారు. రాంగుట్టపై హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నందున వారు స్థలం పరిశీలించారు.



ముధోల్‌లో మాట్లాడుతున్న స్వామీజీ

రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలి

ఖానాపూర్: సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని ఖానాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ సహకార సంఘం ఆవరణలో నాబార్డు బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాత ప్రదర్శనకు హాజరై మాట్లాడారు. డిపాజిట్ పథకాలు, రుణాలు, ఇన్‌స్రూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాజాత సభ్యులు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. పీఏసీఎస్ డైరెక్టర్ విలాస్, సీఈఓ ఆశన్న, సూపర్‌వైజర్ రాజేశ్, సత్తనపల్లి సీఈఓ తుప్రాన్ శ్రీనివాస్, రమేశ్, నారాయణ ఉన్నారు.

రేపు టీజీ సెట్

నిర్మల్‌రూరల్: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాల, జుమ్మురాత్పేట్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఉంటాయన్నారు. మొత్తం 240 మంది విద్యార్థుల చొప్పున రెండు కేంద్రాల్లో పరీక్షకు హాజరవుతారన్నారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని.. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించే ప్రవేశపరీక్షకు 384 మంది హాజరవుతున్నారని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

‘చివరి ఆయకట్టుకు నీళ్లివ్వడంలో విఫలం’

ఖానాపూర్: సదర్మాట్ ఆనకట్ట పరిధిలోని చివరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాదనకుర్తి గ్రామంలో నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సదర్మాట్‌కు ప్రత్యేక కెనాల్ నిర్మిస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్‌కు రైతు సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే హామీ నెరవేర్చాలన్నారు. అనంతరం ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుడాల రాజన్న, లింబాద్రి, కమలాకర్, రవి, స్వామి, శేఖర్, సంతోష్, శ్రీనివాస్, బుచ్చన్న, మహేందర్, రవీందర్, మల్లేష్, తదితరులు ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న రాథోడ్ రమేష్

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామంలో ఉపాధి కూలీలకు బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రమేశ్, మేకల వెంకటేశ్, లక్ష్మణ్, స్వామి, గోపాల్‌రెడ్డి, సుధాకర్ ఉన్నారు.

ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలు పరిష్కరించాలి

- దస్తురాబాద్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేఖానాయక్

దస్తురాబాద్: గ్రామీణ ప్రజల సమస్యలను అధికారులు, పాలకులు సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సింగరి కిషన్ అధ్యక్షతన దస్తురాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

- ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదనచారి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో వార్షిక పరీక్షలు పూర్తి చేశామన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు సైతం అందించామన్నారు.
- పీహెచ్‌సీ వైద్యాధికారి కామేశ్వర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు నిర్వహించామన్నారు. 7,043 మందికి కంటిపరీక్షలు చేసి 1,056 మందికి కంటి అద్దాలు అందించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి త్వరలో కాంట్రాక్టు పద్ధతిలో ఇద్దరు వైద్యులు వస్తారని పేర్కొన్నారు.
- ఉద్యానవనశాఖ అధికారి నవీన్ మాట్లాడుతూ మండలంలో 300 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుకు లక్ష్యం ఉండగా ప్రస్తుతం 89 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. జూన్ మాసంలో మరో 50 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈజీఎస్ ఏపీవో రవిప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 4,262 జాబ్‌కార్డులుండగా 3,162 మంది పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కార్డుదారుడికి వంద రోజుల పని కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.
- తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ రేషన్ కార్డుల్లో కుటుంబసభ్యుల ఆడింగ్ జరుగుతుందన్నారు., విద్యుత్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
- పశువైద్యాధికారి సుకన్య మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ కోసం 216 దరఖాస్తులు వచ్చాయన్నారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ శారద, వైస్ ఎంపీపీ రాజునాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు ముస్తాఫ, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు సంతోష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

అటెన్షన్ ప్లీజ్.. గుంతతో వాహనదారులకు ముప్పు



తానూరు: గతేడాది వర్షాల కారణంగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన జౌలా(బి)-తానూరు రెండు వరుసల రోడ్డు కోతకు గురై గుంత ఏర్పడింది. రాత్రి ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కొండయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 96663 31486

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందిస్తారని.. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సీడీపీఓ సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని బాదనకుర్తి, సుర్జాపూర్ గ్రామాల్లోని కేంద్రాల్లో నిర్వహించిన వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారుల వేషధారణ అలరించింది. సుర్జాపూర్‌లో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలత, బాదనకుర్తి సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, ఉప సర్పంచ్ నవీన్, శనిగారపు శ్రావన్, శంకర్ తదితరులు ఉన్నారు.

కుంటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేకాధికారి సుదర్శన్ పేర్కొన్నారు. మండలంలోని లింబా(బి) అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం వైకుంఠధామం, నర్సరీ, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, సర్పంచ్ మల్లేశ్, కార్యదర్శి సుమన్, సాయినాథ్, టీచర్ గంగామణి తదితరులున్నారు.



కుంటాల: కేంద్రంలో భోజనం చేస్తున్న అధికారి

బీజేపీ కార్యకర్తల అరెస్టు

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం వద్దకు వెళ్తున్న మంత్రిని అడ్డుకునేందుకు యత్నించిన బీజేపీ కార్యకర్తలను ముధోల్ సీఐ వినోద్, పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకొని వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు రాజూర, ధర్మోర, కిష్టాపూర్ గ్రామాల బీజేపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జామా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి ఐకేరెడ్డి పాల్గొన్నారు. ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండలాధ్యక్షుడు అర్జున్‌సింగ్, జిల్లా కార్యదర్శి రాజేందర్, నరేందర్, సాయికృష్ణ, లక్ష్మణ్, కైఫ్ ఉన్నారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని షాదీ ఖానాలో జామా మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. రంజాన్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జామా మసీద్ కమిటీ సభ్యులు షాదీఖానాలో మహిళలకు ప్రత్యేక డైనింగ్ హాల్ నిర్మించాలని మంత్రికి విన్నవించగా సానుకూలంగా స్పందించారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎంపీటీసీ మల్లేశ్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, రమేశ్, గంగారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫసి, మైనార్టీ యూత్ ప్రెసిడెంట్ మజర్, జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు అబిద్‌ఖాన్, సభ్యులు జుబేర్, రైస్‌ఖాన్, రఫీ, ముస్లింలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి ఐకేరెడ్డి, నేతలు

వైకుంఠరథం ప్రారంభం

లోకేశ్వరం: మండల ప్రజలు అంత్యక్రియల సమయంలో ఇబ్బంది పడకుండా కిష్టాపూర్‌కు చెందిన దేవేందర్‌రెడ్డి(నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు) సొంతంగా రూ.2.50లక్షలతో స్వర్గ రథం(వైకుంఠరథం)ఏర్పాటు చేయించారు. లోకేశ్వరంలో రథానికి మంత్రి భూమిపూజ చేశారు. కిష్టాపూర్ వైకుంఠధామంలో మరో రూ.60 వేలతో శివుడి విగ్రహం ఏర్పాటు చేస్తామని దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సర్పంచ్ శైలజ ఉన్నారు.

వీవోఏల సమ్మెకు నాయకుల మద్దతు

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఖానాపూర్‌లో శుక్రవారం సమ్మెకు సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మద్దతు తెలిపారు. వీవోఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లావణ్య, గంగాధర్, రవీందర్, గోవింద్, అపర్ణ, అభిషేక్ ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో వీవోఏల సంఘం మండల కన్వీనర్ బక్కి మహేశ్, ఉపాధ్యక్షురాలు హసీనా, కార్యదర్శి గౌతమ్, కోశాధికారి మట్ట గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వీవోఏల సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు పలికారు. ఏఐటీయూసీ నాయకులు కట్ల రాజన్న, గంగన్నలు కూడా మద్దతు తెలిపారు. ఎంపీటీసీ గడ్డం నర్సారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చిన్నయ్య, పోశెట్టి, అనిల్, గోవర్ధన్, రాజు,గంగాధర్ పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలో వీవోఏలు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

ముధోల్: మండల పరిషత్తు కార్యాలయం ఎదుట చేపట్టిన వీవోఏల సమ్మెకు టీజేఎస్ ఇంచార్జీ సర్దార్ వినోద్ కుమార్ మద్దతు తెలిపారు. ఓమేశ్వర్, భోజన్న, పోశెట్టి, సునంద, శ్రీలత ఉన్నారు.

మామడ: మండల కేంద్రంలో వీవోఏలు చెవిలో పూలు పెట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. శ్వేత, రజిత, పోతన్న, భీమేశ్, ప్రేమ్‌సింగ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యేకు ఆహ్వానం

భైంసారూరల్: కుభీర్ మండలం చాత యువజన సంఘం సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని దేగాంలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 30న నిర్వహించే అంబేద్కర్ విగ్రహ పునప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. సంఘం అధ్యక్షుడు వాడేకర్ ప్రకాశ్, దిలీప్, లక్ష్మణ్, గణేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాడేకర్ రమేశ్, శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఇటీవల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన బోరుకు శుక్రవారం కౌన్సిలర్ స్రవంతి ఆధ్వర్యంలో మోటార్ బిగించారు. దీంతో కాలనీవాసులు నీ రు పట్టుకున్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు ఎన్.సంతోష్ మాట్లాడుతూ కాలనీలో నీటి ఎద్దడి దృష్ట్యా ఎంపీ సోయం సహకారంతో బోరు వేయించినట్లు పేర్కొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

సారంగపూర్: ప్రధానమంత్రి జన్‌జీవన్ బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీరవెల్లి టీజీబీశాఖ మేనేజర్ సందీప్‌సింగ్ అన్నారు. మండలంలోని వంజర్ గ్రామంలో శుక్రవారం బీమా పథకాలు వివరించారు.

అన్నదానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆసుపత్రిలో పులివేలి గణేశ్ గురుస్వామి జయంతి పురస్కరించుకొని వారి కుమారుడు మణికంఠ శుక్రవారం అన్నదానం, వృద్ధాశ్రమంలో అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. రమేశ్, నరహరి పాల్గొన్నారు.